క్లుప్తంగా

ఎఫ్ఆర్ఎస్ సమయానికి పూర్తిచేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రకాశ్

కెరమెరి: ఎఫ్ఆర్ఎస్ సమయానికి పూర్తి చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని ఆగుర్‌వాడ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. రికార్డులు అన్ని పూర్తి చేయాలని సూచించారు. ప్రతీరోజు వర్క్ బుక్స్‌లలో విద్యార్థులతో రాయించాలని, రాసిన వాటికి దిద్దాలన్నారు. మెనూ పాటించాలని, ప్రతీవారంలో మూడు సార్లు గుడ్లు వడ్డించాలన్నారు. ఏజీఆర్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని పేర్కొన్నారు. హెచ్ఎం తిరుమల ఉన్నారు.

ప్రభుత పాఠశాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో సత్యనారాయణ గురువారం సందర్శించారు. రికార్డులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన వసతిని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అదేవిధంగా మాకిడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు.

కెరమెరి: తాజా కూరగాయలతో వంటలు తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మండలంలోని జోడేఘాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతోపాటు వంటగదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్ఎం ఆత్రం మోతీరాం ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏడీఏ మనోహర్, ఏవో గిరిషన్

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఏడీఏ మనోహర్, ఏవో గిరిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువులు, మందులను పరిశీలించారు. యజమానులు షాపులో ఉన్న స్టాక్ వివరాలు బోర్డులపై పెట్టాలన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు నానో యూరియా, నానో డీఏపీలపై అవగాహన కల్పించాలన్నారు. రైతులకు విక్రయించిన ఎరువులు, విత్తనాలు, మందులకు రసీదులు ఇవ్వాలన్నారు.

కాలం చెల్లిన మందులు వాడొద్దు

కెరమెరి(ఆసిఫాబాద్): కాలం చెల్లిన మందులు వాడొద్దని కేంద్ర ఆరోగ్య ప్రతినిధి వరణ్ గాయక్‌వాడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. సిబ్బంది వివరాలు, హాజరు పట్టికతోపాటు ల్యాబ్, ఇతర రూంలు పరిశీలించారు. గ్రామాల్లో అందిస్తున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. రక్త నమూనాల సేకరణ గురించి తెలుసుకున్నారు. డీపీఎం శ్యాంలాల్, వైద్యాధికారి దీక్షిత, సూపర్‌వైజర్ సోము, హెచ్‌వీ లక్ష్మీకాంత, సంపూర్ణ ఉన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఓల్డ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో గణిత, భౌతిక, జీవ శాస్త్ర విషయాలపై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు హాజరైతే అధునాతన బోధన పద్ధతులు అకాడమిక్ క్యాలెండర్ పరంగా చేపట్టబోయే కార్యక్రమాలపై పూర్తిగా అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు జాడి దేవాజీ, తాటి రవీందర్, వెంకటరాజయ్య, రిసోర్స్‌పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ క్వార్టర్స్ వద్ద



శ్యామ్‌మోడల్ స్కూల్ సమీపంలో..



మొగడ్‌దగడ్ చౌరస్తాలో..

రోడ్లపై గుంతలు

కౌటాల: మండల కేంద్రంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించలేదు. గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఉంటుంది. రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి ఇరువైపులా భారీగా భవనాలు నిర్మిస్తున్నారు. యజమానులు ప్రధాన రహదారిపై ఇసుక, కంకర, మొరం కుప్పలు వేస్తున్నారు. వానొస్తే ఇసుక, మొరం రోడ్డు పైకి వచ్చి పేరుకుపోతుంది. ఆర్టీసీ బస్టాండ్, మొగడ్‌దగడ్ రోడ్డు, మార్కెట్ ఏరియా, శ్యాం మోడల్ స్కూల్, నదీమాబాద్ చౌరస్తా, ఓల్డ్ క్వాటర్స్, జూనియర్ కాలేజీ వద్ద కౌటాల-బెజ్జూర్ ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి ఉన్నాయి. ఇవి గమనించకుండా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతేడాది పలుచోట్ల గుంతలకు మరమ్మతు చేసిన నాణ్యత లేకుండా ఉన్నాయి.

ఆధార్ హాజరు..!



కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- నేటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు!
- రోగులకు అందనున్న వైద్యసేవలు

కౌటాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సర్కారు చర్యలు చేపడుతోంది. వైద్యసేవల్లో పారదర్శకత తేవాలన్న లక్ష్యంతో ఆధార్ హాజరు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆధార్ బేస్ట్ అటెండెన్స్ సిస్టమ్(ఏబీఎస్‌ఏ) ఆగస్టు 1 నుంచి అమలు చేయనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాల్సిందిగా రాష్ట్ర వైద్యశాఖ కార్యదర్శి క్రిస్టినా ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఆధార్ అటెండెన్స్ ద్వారా వైద్యులు, సిబ్బంది తమకు నిర్దేశించిన సమయానికి అనుగుణంగా వచ్చి రోగులకు వైద్యసేవలు అందించనున్నారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదు.

జిల్లా వివరాలు	
పీహెచ్‌సీలు	22
సీహెచ్‌సీలు	5
జిల్లా ఆస్పత్రి	1

జిల్లాలో..

జిల్లాలో మొత్తం 28 ప్రభుత్వ ఆస్పత్రులున్నాయి. ఇవన్నీ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, వైద్యారోగ్య శాఖ విభాగాల పరిధిలో ఉన్నాయి. వీటన్నింటిలోనూ ఆధార్ ఆధారిత హాజరు ప్రవేశపెట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కొత్త డిజిటల్ వ్యవస్థను తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్(టీజీటీఎస్) ఆధ్వర్యంలో ప్రవేశ పెడుతున్నారు. ఆధార్ బెస్ట్ అటెండెన్స్ సిస్టమ్ తెలంగాణ విద్యా వైద్యపరిషత్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి వర్తిస్తుంది.

ఆధార్‌ను స్కాన్ చేసి..

ఉద్యోగులు తమ ఆధార్ కార్డును స్కాన్ చేసి అటెండెన్స్‌ను నమోదు చేసుకోవాలి. ఆస్పత్రుల్లో అమలు చేసే బాధ్యత టీజీటీఎస్ తీసుకుంది. ప్రతినెలా జిల్లా, రాష్ట్రస్థాయిలో రియల్ టైంలో అటెండెన్స్ డేటా సేకరించి, అధికారులకు అందజేస్తుంది. జిల్లాలో మాస్టర్ ట్రైనర్లు ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి అటెండెన్స్ సిస్టమ్‌ను సక్రమంగా నడిపేలా పర్యవేక్షిస్తారు. రాష్ట్రస్థాయిలో కమిషనర్, డైరెక్టర్లు ఈ ప్రక్రియను నడిపించే బాధ్యత తీసుకుంటారు.

ఆదేశాలు రాలేదు



జిల్లాలోని ఆస్పత్రుల్లో ఆధార్ హాజరు అమలుచేయాలని ఇప్పటివరకు ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఆధార్ హాజరును అన్ని ఆస్పత్రుల్లో పకడ్బందీగా అమలు చేస్తాం.

– సీతారాం, డీఎంహెచ్‌ఓ

మహిళలు సాధికారత సాధించాలి



అంగన్‌వాడీలతో సాధికారత కేంద్రం సిబ్బంది

చింతలమానెపల్లి: మహిళలు సాధికారత సాధించే దిశగా అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ బి.శారద అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళాసాధికారత కేంద్రం, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోఆర్డినేటర్ శారద, జెండర్ స్పెషలిస్ట్ బి.రాణి, సఖి కేంద్రం నిర్వహణాధికారి మమత.. అంగన్‌వాడీలకు పలు అంశాల గురించి తెలియజేశారు. బేటీబచావో బేటీ పడావో ముఖ్య ఉద్దేశం, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, గృహ హింస, వరకట్న వేధింపులు, సైబర్ క్రైం, రుతుక్రమ పరిశుభ్రత, గర్భస్థ శిశులింగ నిర్ధారణ, పోక్సో చట్టం, మహిళలకు న్యాయ సహాయం, రక్షణ అందించే హెల్ప్‌లైన్ నంబర్లు 181, 1098, 1930, 100, 112 లాంటి అంశాల గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ అవగాహన కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను అంగన్‌వాడీలు గ్రామాల్లో మహిళలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



ఇసుక ట్రాక్టర్ వద్ద సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్‌రూరల్: అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా హెచ్చరించారు. మండలంలోని అందవెల్లి గ్రామ సమీపంలో గల పెద్ద వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను గురువారం పట్టుకుని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే ఇసుకను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దీని సాకుగా చేసుకొని ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు గుర్తిస్తే సమాచారం అందించాలని కోరారు. ఆర్ఐ సిద్ధార్థ ఉన్నారు.

మండల సమస్యలపై వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

బెజ్జూర్: మండలంలోని ప్రధాన సమస్యలపై జిల్లా జాతీయ మానవ హక్కుల బృందం సభ్యులు తహసీల్దార్ రామ్మోహన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా మానవ హక్కుల చైర్మన్ దుర్గం శ్యామ్‌రావు మాట్లాడుతూ విద్య, వైద్యం, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించాలన్నారు. సంబంధిత అధికారులతో త్వరలో సమీక్ష సమావేశం నిర్వహించి పరిష్కారానికి చర్యలు చేపడతానని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. తెలంగాణ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జనార్దన్, మండల అధ్యక్షుడు కామ్రే తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

గోలేటి అభివృద్ధికి కృషిచేయాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాకు కీలకంగా ఉన్న గోలేటి అభివృద్ధికి సింగరేణి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయంలో గురువారం రిటైర్డ్ సింగరేణి జీఎం రవి ప్రసాద్‌తోపాటు ఇటీవల పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్వర్‌రావు, సెక్యూరిటీ అధికారి దాసరి శ్రీధర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి అభివృద్ధికి సింగరేణి తోడ్పాటు అందించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు.

జోడేఘాట్‌లో ఆదివాసీ దినోత్సవం



నియామక పత్రాలు ఇస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని రాజ్‌గోండ్ సేవా సమితి నాయకులు నిర్ణయించారు. గురువారం మండలంలోని ఆదివాసీ భవన్‌లో వారు సమావేశమయ్యారు. ఈ నెల 9న ఉదయం కెరమెరి నుంచి హట్టి మీదుగా జోడేఘాట్‌కు వెళ్లి కుమురం భీం విగ్రహానికి నివాళులర్పించి, సమాధి వద్ద పూజలు చేస్తామని తెలిపారు. ఆదివాసీ భవన్‌లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇటీవల రాజ్‌గోండ్ సేవా సమితి మండల అధ్యక్షులుగా ఎన్నికైన పెందోర్ మోతీరాం, తుడుందెబ్బ నాయకులు కుడ్మెత సోము, ఆత్రం భీంరావుకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో రాజ్‌గోండ్ సేవా సమితి నాయకులు పర్చకి కేశవరావు, పెందోర్ ప్రభాకర్, మడావి శ్రీనివాస్, కుర్సెంగ మోతీరాం, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, రాయిసెంటర్ నాయకులు ఆత్రం బొజ్జిరావు, రాయిసిడాం జంగు, ఆత్రం లక్ష్మణ్, మడావి భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎస్పీని కలిసిన కౌటాల సీఐ



ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు మొక్క ఇస్తున్న సీఐ

బెజ్జూర్/కౌటాల: కౌటాల నూతన సీఐ బాధ్యతలు స్వీకరించిన సంతోష్‌కుమార్ గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ దండే విఠల్‌ను కాగజ్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమొక్క అందజేశారు. కౌటాల సర్కిల్ పరిధిలోని సిర్పూర్(టి), చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాల పరిధిలో శాంతిభద్రత పరిరక్షించాలని ఎస్పీ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

కౌటాల: కళాశాలల్లో విద్యార్థులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి చదువుల్లో రాణించాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడితే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్సై విజయ్, ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, అధ్యాపకులు ఆంజనేయులు, అశోక్, రాంబాబు, మోతీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన: సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులు పని స్థలాలకు దగ్గరగా నివాసం ఉండేలా చూసుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం ఉమాకాంత్ అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో క్వార్టర్ల కేటాయింపు కోసం ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియాకు బదిలీపై వచ్చిన, నూతనంగా ఉద్యోగంలో చేరినవారికి కౌన్సెలింగ్ నిర్వహించి ఎంపిక చేసుకున్న క్వార్టర్లను అధికారులు కేటాయించారు. అనంతరం ఉమాకాంత్ మాట్లాడుతూ ఉద్యోగులు పని స్థలాలకు అందుబాటులో ఉండేలా నివాసం ఏర్పాటు చేసుకోవాలన్నారు. దాంతో సమయం ఆదా కావడంతోపాటు కుటుంబ సభ్యులతో గడిపేందుకు సమయం దొరుకుతుందన్నారు. డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనాబాషా, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ సాయి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కౌటాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయాలని, ప్రతీ వారం రెండు రోజుల పాటు డ్రైడే నిర్వహించాలన్నారు. క్లోరినేషన్ చేసి తాగునీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికుడికి సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరగూర ఓసీపీలో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ గురువారం ఉద్యోగ విరమణ పొందిన జెట్టి మురహరి రావు దంపతులను గని అధికారులు, యూనియన్ నాయకులు, తోటి కార్మికులు సన్మానించారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, యూనియన్ నాయకులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషశయనరావు, కిరణ్‌బాబు, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఓదెలు, నాయకులు రాజయ్య, అంజయ్య, తిరుపతి, రమేశ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సన్మానం

టీబీజీకేఎస్ ఏరియా కమిటీ సభ్యుడు జెట్టి మురహరిరావు గురువారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, సెంట్రల్ కమిటీ నాయకులు దారావత్ మంగీలాల్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

దహెగాం: మండలంలోని నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను శుక్రవారం స్థానిక రైతు వేదికలో పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మునవార్ షరీఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా హాజరై లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. సకాలంలో లబ్ధిదారులు చేరుకోవాలని సూచించారు.

గోపాల్‌పూర్ తండాలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

లింగాపూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామచందర్, ఎంపీవో రజనీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని గోపాల్‌పూర్ తండాలో లింగాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు చేసి జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా తదితర లక్షణాలను ఉన్న వారిని గుర్తించారు. రోగుల రక్త పరిశీలన చేసి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ దత్తారాం, హెల్త్ అసిస్టెంట్ సునీల్, సంతోష్, ఏఎన్ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

మహిళల వేధింపుల నిర్మూలనకే భరోసా కేంద్రం

ఆసిఫాబాద్: మహిళల వేధింపుల నిర్మూలన కోసమే భరోసా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు, యువతులు హింస, లైంగిక వేధింపులకు గురైతే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణకోసం భరోసా సెంటర్లు పని చేస్తున్నాయన్నారు. విద్యార్థినులు, మహిళలు లైంగిక వేధింపులకు గురైతే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీసులను నేరుగా సంప్రదించలేని వారు జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్ 8712670561 లేదా, డయల్ 100, 102కు సమాచారం అందించాలని తెలిపారు. వారికి భరోసా టీమ్ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

30 పోలీస్ యాక్టు కొనసాగింపు

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతిభద్రతలు, ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లావ్యాప్తంగా ఆగస్టు 31 వరకు పోలీసు యాక్టు 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజనల్ పోలీసు అధికారి, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలపై నిషేధం ఉంటుందని తెలిపారు. కత్తులు, తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలు వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారు శిక్షార్హులవుతారని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, గుంతలు పడిన రోడ్లకు మరమ్మతు చేపట్టాలని కోరారు. వీధిదీపాలు, పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వీధి కుక్కల బెడద నివారించాలన్నారు. ఎస్పీఎం లారీలు రోడ్లపై నిలుపుదల చేయడంతో ట్రాఫిక్‌సమస్య ఏర్పడుతుందన్నారు. పట్టణంలో మాస్టర్‌ప్లాన్‌ను అమలయ్యేలా చూడాలన్నారు. నాయకులు ముంజం ఆనంద్ కుమార్, ముంజం శ్రీనివాస్, చాప్లె సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

చారిటబుల్ ట్రస్ట్‌కు విరాళం

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్సై తుకారాం దుర్గే గురువారం రామ్‌లీలా చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.12 వేల విరాళాన్ని అందజేశారు. రామ్‌లీలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సాయి లైఫ్‌లైన్ ఆసుపత్రిలో ప్రతి గురువారం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులకు రిటైర్డ్ ఎస్సై.. చెక్కు అందజేశారు. తన పెన్షన్ డబ్బుల నుంచి ప్రతినెల రూ.12 వేలను ట్రస్టుకు విరాళంగా చెల్లించనున్నట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోస్త్ రిజిస్ట్రేషన్ గడువు పెంచాలి

ఆసిఫాబాద్‌రూరల్: డిగ్రీ విద్యార్థుల అడ్మిషన్‌కి సంబంధించిన దోస్త్ రిజిస్ట్రేషన్ గడువు మరో వారం పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు తిరుపతి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గత 15 రోజులుగా వర్షాలు రావడంతో గిరిజన మారుమూల ప్రాంతాల ఇంటర్ విద్యార్థులు కొంత మంది రిజిస్ట్రేషన్ చేసుకోలేదని పేర్కొన్నారు. వారం గడువు పెంచి వారికి అవకాశం కల్పించాలని కోరారు.

నాయకుల అరెస్టు

కెరమెరి: లంబాడా వర్గానికి చెందిన ఒక్క ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ముట్టడికి వెళ్తున్న సేవాలాల్ సేనా నాయకులను కెరమెరి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ మాట్లాడుతూ లంబాడా వర్గానికి చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన యూనివర్సిటీ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మిగిలిన పోడు భూములకు పట్టాలివ్వాలని పేర్కొన్నారు. నాయకులు శంకర్, చందునాయక్, సందీప్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

లంబాడిహేటిలో తనిఖీ

చింతలమానెపల్లి: మండలంలోని లంబాడిహేటిలో గురువారం పోలీసులు తనిఖీ నిర్వహించారు. కౌటాల సీఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలతో సమావేశమయ్యారు. మూఢ నమ్మకాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. నాటుసారా నియంత్రణకు సహకరించాలన్నారు. తనిఖీల్లో భాగంగా సంబంధిత పత్రాలు లేకుండా పట్టుబడిన 27 వాహనాలకు జరిమానా విధించారు. 2 వేల లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారా పట్టుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎస్సైలు ఇస్లావత్ నరేశ్, విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.